‘బాల్క’పై ఆగ్రహ జ్వాల..!

- జిల్లా వ్యాప్తంగా బాల్క సుమన్ దిష్టిబొమ్మలు దహనం
- పలుచోట్ల పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు



బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం/నస్పూర్/చెన్నూర్/మందమర్రిరూరల్/చెన్నూర్‌రూరల్/భీమారం/బెల్లంపల్లి/కాసిపేట/కోటపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పరుష పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. శవయాత్రగా ఊరేగింపు నిర్వహించి బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ‘బాల్క సుమన్ అమర్‌రహే’ అంటూ నినాదాలు చేశారు. జన్నారంలో సుమన్ ఫ్లెక్సీని దహనం చేశారు. హాజీపూర్‌లో సుమన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టారు. నస్పూర్ సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారిపై బాల్కసుమన్ ఫ్లెక్సీకి చెప్పుల దండలు వేసి గాడిదపై ఊరేగించి డప్పు చప్పుళ్లతో శవయాత్ర నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుమన్ స్థాయిని మరిచి సీఎం రేవంత్‌రెడ్డిని అవమానకరంగా మాట్లాడటం సరికాదన్నారు. సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బేషరతుగా సీఎంకు సుమన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న సీఎంను అభినందించాల్సింది పోయి, అవినీతి, గుండాగిరికి పాల్పడి అక్రమ సంపాదన కూడగట్టిన సుమన్ నీతులు వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. మందమర్రి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే సుమన్‌కు చెన్నూర్ ప్రజలు ఆదరించి ఎమ్మెల్యే పదవి భిక్షగా పెడితే, అహంకార పూరితంగా వ్యవహరించడంతో అనేక మంది నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారని గుర్తు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వివేక్ వెంకటస్వామిని గెలిపించి తగిన బుద్ధి చెప్పారన్నారు. సీఎంపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేకుంటే మంచిర్యాల జిల్లాలో తిరుగనిచ్చేది లేదని హెచ్చరించారు. బెల్లంపల్లి వన్‌టౌన్‌లో సుమన్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేస్తూ వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు, మందమర్రి పోలీస్‌స్టేషన్లో ఎస్సై చంద్రకుమార్‌కు,చెన్నూర్‌లో సీఐ రవీందర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో జన్నారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, అర్జునగుట్టలో మాజీ జెడ్పీటీసీ ఎలాది సమ్మయ్య, బెల్లంపల్లిలో పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నాతరి స్వామి, మున్సిపల్ కౌన్సిలర్ రాము నాయక్, ప్రభాకర్, కృష్ణ, సంగీత, రేణుక, హాజీపూర్ మండల అధ్యక్షుడు తోట రవి, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, డేగ బాపు, నస్పూర్‌లో మల్లేశ్, సంపత్‌రెడ్డి, సంజీవ్, లింగయ్య, మధుకర్, దేవాపూర్‌లో రత్నం ప్రదీప్, కొండపూర్‌లో వేముల కృష్ణ, ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, భీంరావు, మందమర్రి మండల అధ్యక్షుడు నీలయ్య తదితరులు పాల్గొన్నారు.



జన్నారం: ఫ్లెక్సీ దహనం చేస్తున్న నాయకులు



శవయాత్ర నిర్వహిసున్న నాయకులు



చెన్నూర్: దిష్టిబొమ్మ దహనం



తాండూర్‌లో...



దుగ్నెపల్లిలో దిష్టిబొమ్మ ఊరేగిస్తూ..



నిరసన తెలుపుతున్న నాయకులు



కాసిపేట: కొండపూర్‌లో...



కోటపల్లి: అర్జునగుట్టలో...



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ శ్రేణుల తోపులాట



గౌస్‌ను నిలువరిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు తగ్గడం లేదు. ఇన్నాళ్లు ప్రతిపక్షం ఉండగా కలహాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వర్గపోరును వీడటం లేదు. బెల్లంపల్లిలో ఇరువురు కాంగ్రెస్ శ్రేణులు తగువులాడుకున్న ఘటన మంగళవారం చర్చనీయాంశమైంది. పార్టీ శ్రేణులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేసి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా వాదులాటకు దిగారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, ముస్లిం మైనార్టీ నాయకుడు ఎండి.గౌస్‌ల మధ్య మాటమాట పెరిగి బహిరంగంగా రోడ్డుపై బాహాబాహీకి దిగడానికి సిద్ధపడి తోపులాడుకున్నారు. ఈ ఘటన చూపరులను ఆశ్చర్యానికి గురి చేసింది. వెంటనే అక్కడున్న మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, ఇతర నాయకులు జోక్యం చేసుకుని గొడవ జరగకుండా ఇరువురిని అడ్డుకున్నారు. ఈ ఘటన కాంగ్రెస్ మార్కును గుర్తు చేసిందని అక్కడున్న కొందరు వ్యాఖ్యానించడం గమనార్హం.

‘బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి’

శ్రీరాంపూర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేసిన బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకుంటే సింగరేణిలో ఆయనను తిరుగనీయమని హెచ్చరించారు. బాల్క సుమన్ వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం అన్ని గనులపై ఆయన దిష్టిబొమ్మ దహనం చేసి, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వివరాలు తెలుసుకుంటున్న యాదయ్య

బెల్లంపల్లి: పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సూచించారు. తాండూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను, పాఠశాల ఆవరణను, వంటగదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొచ్చేలా చొరవ తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో ప్రభాకర్, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుమన, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న నిరాహారదీక్ష

పాతమంచిర్యాల: పవర్‌ప్లాంట్ కార్మికులకు రావాల్సిన క్లోజింగ్ బెన్‌ఫిట్స్, వేతనాల బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన నిరాహారదీక్ష మంగళవారం 7వ రోజుకు చేరింది. కార్మికులు చేపట్టిన నిరాహా రదీక్షకు అఖిల భారతీయ కదన్ మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ రమాకాంత్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో శాలీ వాహన పవర్ ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సత్యనారాయణ, భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు పాల్గొన్నారు.

మట్టినమూనాల సేకరణ

భీమారం: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో జగిత్యాలలోని వ్యవసాయ పరిశోధన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం రైతుల భూముల్లో మట్టి నమూనాలు సేకరించారు. రైతులు వ్యవసాయ శాఖ ద్వారా ఏటా భూమిలో మట్టి సేకరించి, భూసార పరీక్షలు జరిపిస్తే భూసారంలో ఎలాంటి లోపం ఉందనేది తెలుస్తుందన్నారు. వ్యవసాయ శాఖ ఇచ్చే సూచనల ప్రకారం సాగు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విద్యార్థి ముత్యం తిరుపతి, రైతులు పెద్దపల్లి తిరుపతి, రాంచందర్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుపై విచారణ

వేమనపల్లి: మండల కేంద్రానికి చెందిన దేసబోయిన శంకర్ తనకు పింఛన్ రావడం లేదని హైదరాబాద్‌లో ప్రజావాణి నోడల్ అధికారికి ఫిర్యాదు చేయగా ఎంపీడీఓ లక్ష్మయ్య ఆధ్వర్యంలో విచారణ జరిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారుడు ఎంపీడీఓకు అందించగా, దరఖాస్తు ప్రతులను ఎంపీడీఓ పరిశీలించి 2019వరకు సదరన్ ధ్రువీకరణ పత్రం ఉండగా కాలపరిమితి ముగిసి పింఛన్ ఆగిపోయింది. 2020లో సదరన్ సర్టిఫికెట్ పొందగా 27శాతం అంగవైకల్యంతో పింఛన్ రావడం లేదని ఎంపీడీఓ తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

చెన్నూర్: పట్టణంలోని ఇందిరానగర్ మైదానంలో బీఆర్ అంబేద్కర్ మున్సిపల్ స్థాయి క్రికెట్ పోటీలను 4వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ టాస్ వేసి ప్రారంభించారు. పోటీల్లో 18జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.2000 నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తిరుపతి సురేశ్, గుడిమల్ల రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు మేకల వెంకటేశ్, ఉదయ్, శ్రవణ్, అజయ్, పవన్, మదన్, బన్నీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అవకాశం కల్పించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లు గత కొన్నేళ్లుగా డ్రైవింగ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేయించుకోలేదని, ఈ క్రమంలో రెన్యూవల్‌కు అవకాశం కల్పించాలని కోరుతూ మంగళవారం డీటీఓ కిష్టయ్యకు బెల్లంపల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవింగ్ లైసెన్స్‌లు సకాలంలో రెన్యూవల్ చేయించుకోలేక పోయామని, ఎలాంటి జరిమానా లేకుండా రెన్యూవల్ చేయించుకునేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు కట్ట రాంకుమార్, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యమే విజయానికి పునాది

కోటపల్లి: ఉన్నత లక్ష్యమే విజయానికి పునాది అని వ్యక్తిత్వ వికాస నిపుణుల నాగేంద్ర అన్నారు. పారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం యోగేశ్వర్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాస నైపుణ్యంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు నాగేంద్ర మాట్లాడుతూ ఆత్మవిశ్వాసమే సోపానం, లక్ష్యమే జ్ఞాపకశక్తి ఏకాగ్రతను పెంపొందిస్తుందని విద్యార్థులకు సూచించారు. అనవసరమైన ఆకర్షణలు అధిగవిస్తేనే విజయాలు చేరువవుతారన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

- రోడ్డుపై బైఠాయించిన బీఆర్‌ఎస్ శ్రేణులు



అడ్డుకుంటున్న పోలీసులు

చెన్నూర్: పట్టణంలో సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు పూనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సీఐ రవీందర్ సంఘటనా స్థలానికి చేరుకొని దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లెల దామోదర్‌రెడ్డి, కోటపల్లి వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు, కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, అనిల్, జగన్నాథుల శ్రీనివాస్, తుమ్మ రమేశ్, తాటికొండ సురేశ్, సాధనబోయిన కృష్ణ, మేడ సురేశ్‌రెడ్డి, విద్యాసాగర్, కొండపర్తి వెంకటరాజం, మహేందర్, సాంబగౌడ్‌లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నించిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జగన్నాథుల శ్రీనివాస్‌తో పాటు నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, పెండ్యాల లక్ష్మణ్, భారతిలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. అనంతరం సొంత పూచికత్తుపై వదిలేశారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశవర్కర్లు

పాతమంచిర్యాల: ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు పాల్గొంటారని నేషనల్ హెల్త్‌మిషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు అన్నారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో సుబ్బరాయుడును కలిసి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు.

దండేపల్లి: ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షుడు రంజిత్ పిలుపునిచ్చారు. దండేపల్లిలో జీపీ కార్మికులతో కలిసి ఎంపీడీవో మల్లేశంకు మంగళవారం సమ్మె నోటీసు అందించారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని రెవెన్యూ అధికారులకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు సీఐటీయూ నాయకులతో కలిసి సమ్మె వినతిపత్రాన్ని అందజేశారు.

చెన్నూర్‌రూరల్: తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) చెన్నూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీలో వైద్యుడు కృష్ణతేజకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు.

లక్సెట్టిపేట: ఆశవర్కర్లు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి శోభ పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపేట్ పీహెచ్‌సీ పరిధిలోని ఆశ వర్కర్లు వైద్యుడు సతీశ్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్‌రావు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. తాండూర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం మాట్లాడారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో బాల్క సుమన్ లాంటి నాయకుడిని చూడలేదన్నారు. సీఎంపై ఆయన చేసిన వ్యాఖ్యలు హేయంగా ఉన్నాయని తెలిపారు. దీనిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్ కార్యచరణ త్వరలోనే ప్రకటిస్తానని చెప్పారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించి ప్రయోగాత్మకంగా వివరించారు. మానవ శరీరంలోని అంతర్గత అవయవాలపై స్వయంగా ప్రయోగ పరికరాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: రాజకీయాలకు అతీతంగా మున్సిపల్ అభివృద్ధికి పాటు పడతానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను, ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే తప్పక పరిష్కరిస్తానని అభయం ఇచ్చారు. మున్సిపల్ అభివృద్ధికి పాటు పడతానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో తాము కూడా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. చైర్‌పర్సన్ జక్కుల శ్వేతపై సభ్యులు మండి పడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ తరపున చైర్‌పర్సన్‌గా గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పార్టీ మారారని సభ్యులు అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన శ్వేత ఒంటెద్దు పోకడలకు వెళ్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా సభ్యులు తీవ్ర ఆగ్రహావేశాలకు గురయ్యారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కమిషనర్ భుజంగరావు, ఏఈ సందీప్, మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాలను అభివృద్ధి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం భీమిని, కన్నెపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఎన్నో సమస్యలు తీరుస్తానన్నారు. మంగళవారం కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, టేకులపల్లి, పోలంపల్లి, సుర్జాపూర్, గొల్లగట్టు, భీమిని మండలంలోని వీగాం గ్రామపంచాయతీల్లో సుమారు రూ.2కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కన్నెపల్లి సబ్ స్టేషన్ నుంచి రెబ్బెన, జజ్జరవెల్లి, జన్కాపూర్ వరకు బీటీ రోడ్డు పునఃనిర్మాణానికి రూ.2కోట్ల 25లక్షల వ్యయంతో పనులకు భూమిపూజ చేశారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాదవరపు నర్సింగరావు, భీమిని, కన్నెపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రాకేష్‌శర్మ, నాయకులు రవీందర్‌రావు, సత్యనారాయణ, జలపతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉర్సుకు పోటెత్తిన భక్తజనం



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చెన్నూర్: పట్టణంలో సయ్యద్‌షా బాబా రహెమతుల్లా అలై దర్గాలో ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం బాబా దర్శనం కోసం పట్టణ భక్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం పోటెత్తింది. ఉర్సులో కవ్వాలి కళాకారుల పాటలు అందరినీ అలరించాయి. రాత్రి స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి సయ్యద్‌షా బాబాను దర్శించుకొని కవ్వాలి తిలకించనున్నారు. కార్యక్రమంలో ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నవాజ్, కమిటీ సభ్యులు అఖిల్, ఖంరోద్దిన్ పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే లక్ష్యాలు చేరుకోవచ్చు

కాసిపేట: ఉద్యోగులు కంపెనీ సూచించిన సలహాలు, సూచనలు పాటించడంతో ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుందని, అందరూ తమకు కేటాయించిన పనులు నిబద్ధతతో చేసినట్లయితే అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చునని మందమర్రి ఏరియా జీఎం, మల్టీ డిపార్టుమెంట్ కమిటీ చైర్మన్ మనోహర్ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై మంగళవారం మల్టీ డిపార్టుమెంట్ కమిటీ సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సీఎండీ ఆదేశాల మేరకు సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు.

ఉచిత దంత వైద్యశిబిరం



మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 150మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు శ్రీకాంత్, సౌమ్య, ఖయిమ్‌లు మాట్లాడుతూ.. దంత సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టూత్‌పేస్ట్, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్రపాణి పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బందితో సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పని చేస్తుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక అన్నారు. హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు కార్యక్రమంలో వారు మాట్లాడారు. బేటీ బచావో.. బేటీ పడావో, బాలికలు, మహిళల సంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారిణి లహరి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై విద్యార్థులకు అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డెప్యూటీ పారామెడికల్ అధికారులు శివకుమార్, రాఘవయ్య విద్యార్థులకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు మాట్లాడుతూ.. కుష్ఠువ్యాధి సోకకుండా తీసుకునే జాగ్రత్తలు, సోకిన తర్వాత తీసుకునే చికిత్స, నివారణపై వివరించి కుష్ఠువ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం ఉండాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆశ కార్యకర్తలు రజిత, స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిరుపేదలకు సామగ్రి అందజేత

దండేపల్లి: మండలంలోని పెండ్లిమడుగు గిరిజన గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కుటుంబాలకు విద్యుత్ ఉద్యోగులు అండ గా నిలిచారు. 11కుటుంబాలకు దుప్పట్లు, వంటసామగ్రి అందించారు.

పాలకవర్గ సభ్యులకు సన్మానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇటీవల తమ పదవీకాలం పూర్తి చేసుకున్న ముల్కల్ల గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు సతీశ్‌రావు సన్మానించారు.

క్షమాపణ చెప్పాలి

వేమనపల్లి: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఓయూ జేఏసీ, కాంగ్రెస్ మండల నాయకులు మల్లేష్ నేత డిమాండ్ చేశారు.

నేటి నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు

నెన్నెల: పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. యువత స్వయం సహాయక సంఘాలు స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తూ పనులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

‘పేదలకు అండగా ఉంటా’

జన్నారం: పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని, అవసరం ఉంటే ఏ సమయంలోనైనా తనను కలువొచ్చని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన ఉప్పుల లక్ష్మీనారాయణ అనారోగ్యం భారిన పడగా ఆసుపత్రుల ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.4లక్షల ఎల్‌వోసీని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజల సేవ కోసం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఏదైనా అవసరం ఉంటే నేరుగా కలువాలని సూచించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి బాపురావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. మిషన్‌భగీరథ వాటర్ ట్యాంకు, నర్సరీని పరిశీలించి పారిశుద్ధ్య కార్యక్రమం ప్రణాళిక తయారు చేశారు.

నియామకం

లక్సెట్టిపేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం లక్సెట్టిపేట మండల అధ్యక్షుడిగా బుద్దె రాజశేఖర్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ మంగళవారం తెలిపారు.